క్లుప్తంగా

గృహ ప్రవేశాలకు ఆహ్వానం



గుడివాడ టౌన్: సొంతింటి కలను నెరవేరుస్తూ జననేత జగనన్న చేతుల మీదుగా జరుగుతున్న టిడ్కో ఇళ్ల గృహప్రవేశాలకు రావాలని ఐదో వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు పిలుపునిచ్చారు. వార్డులో బుధవారం ఇంటింటికి తిరుగుతూ మహిళలకు బొట్టుపెట్టి ఆహ్వానం పలికారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 9వ తేదీ పట్టణానికి విచ్చేస్తున్న సందర్భంగా ఉదయం 7 గంటలకు వార్డుకు చెందిన కట్టా సాంబయ్య ఇంటివద్ద అల్పాహారం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. అక్కడ నుంచి బస్సులో సభాస్థలికి వెళుతున్నామని, అందరూ హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో అర్జా ప్రసాదు, వెంపల అప్పారావు, పీవీ లక్ష్మణరావు, కె మహాలక్ష్మి, గంగాధరరావు, సీహెచ్ భాగ్యలక్ష్మి, మరడాని హరిత, కట్టా శాంతి మున్సిపల్ మాజీ కౌన్సిలర్ బొజ్జగాని కోటమ్మ, పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష్మీ గణపతి హోమం



గుడివాడ టౌన్: స్థానిక మెయిన్ రోడ్‌లో వేంచేసియున్న విఘ్నేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో లక్ష్మీ గణపతి హోమం బుధవారం ఘనంగా నిర్వహించారు. 92 మంది పుణ్యదంపతులు పాల్గొని భక్తిశ్రద్ధలతో హోమం నిర్వహించినట్లు ఆలయ ఈఓ వీడీడీ ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకవర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యోగా పోటీలు



గుడివాడ టౌన్: ఏఎన్నార్ కళాశాలలో నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ చేపట్టిన జి20 జన్ భగీదరి కార్యక్రమంలో భాగంగా బుధవారం యోగా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కళాశాలకు చెందిన విద్యార్థిని కె.చందు మొదటి బహుమతి సాధించారు. కళాశాల ప్రిన్సిపల్ పీజేఎస్ కుమార్, కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు, వైస్ ప్రిన్సిపల్ ఎం శివనాథ్, బీఎస్ఎస్ పద్మజ విజేతలకు బహుమతులు అందజేశారు. కేబీఆర్ గవర్నమెంట్ ఐటీఐ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కెరీర్ కౌన్సెలింగ్ సెషన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జి.హరిధర్మేంద్ర, ట్రైనర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు ధ్వజస్తంభ ప్రతిష్ట

ముదినేపల్లి రూరల్: మండలంలోని పేరూరులో బాల చాముండిక సమేత అమర లింగేశ్వర స్వామి ఆలయ ధ్వజస్తంభ, విగ్రహప్రతిష్ట కార్యక్రమాలు గురువారం జరిపేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఇందుకు సంబంధించి పలు పూజ కార్యక్రమాలు బుధవారం ప్రారంభించారు. యాజ్ఞిక బ్రహ్మ, దావలి విశ్వేశ్వరశర్మ, నాగేశ్వరి శర్మ పర్యవేక్షణలో ప్రతిష్టా కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అతిథులుగా పాల్గొంటారని చెప్పారు.

అమీనపురంలో....

పమిడిముక్కల: మండలంలోని అమీనపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయంలో గురువారం విగ్రహ, ధ్వజస్తంభ, శిఖర ప్రతిష్ఠలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా దుర్గా, మల్లేశ్వరస్వామి, వినాయకుడు, ఇతర పరివార దేవతల విగ్రహ ప్రతిష్ఠలు, ధ్వజస్తంభ, శిఖర ప్రతిష్ఠలు జరుగుతాయన్నారు. అనంతరం పూర్ణాహుతి, అన్న సమారాధన జరుగుతుందని తెలిపారు. రాత్రికి బాలనాగమ్మ నాటక ప్రదర్శన ఉంటుందన్నారు.

బీసీ, ఎస్సీ కాలనీల్లో మెరక పనులు చేయిస్తా

ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ హామీ

పమిడిముక్కల: పెనుమత్స గ్రామంలోని చెరువు నుంచి మట్టిని తీసి బీసీ, ఎస్సీ కాలనీలను మెరక చేయిస్తానని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ హామీ ఇచ్చారు. మట్టిని కాలనీ మెరక పనులను మాత్రమే వాడుకోవాలని సూచించారు. మండలంలోని పెనుమత్స గ్రామంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి బ్రోచర్లను పంపిణీ చేశారు. గత నాలుగేళ్లగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. స్థానికుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు ఆయా సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయో లేదోనని ఎమ్మెల్యే ఆరా తీశారు. అభివృద్ధే ధ్యేయంగా పాలన సాగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుధా ప్రవీణ్, తహసీల్దార్ రాజ్యలక్ష్మి, వైస్ ఎంపీపీలు కొడమంచిలి మహేష్, జి.సీతారామయ్య, ఎంపీటీసీ జుఝువరపు శృతి, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కినేని సతీష్, పార్టీ మండల అధ్యక్షుడు యలమంచలి గణేష్, నియోజకవర్గ బూత్ కన్వీనర్ మారపాక మహేష్, మాజీ ఎంపీపీ కొంతి వెంకటేశ్వరరావు, రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ కంభపు రాంబాబు, పార్టీ నాయకులు యార్లగడ్డ చంద్రశేఖర్, పర్వతనేని వెంకటేశ్వరరావు, దండమూడి బలరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

అందరిపై బాబా ఆశీస్సులు

గుడివాడరూరల్: బాబా ఆశీస్సులతో ప్రజలందరూ సంతోషంగా జీవించాలని ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) అన్నారు. మండలంలోని మల్లాయపాలెం గ్రామంలో హజరత్ సయ్యద్ సాలార్ షా ఔలియా ఖాదరి ఉరుసు ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో బుధవారం ఎమ్మెల్యే పాల్గొన్నారు. గ్రామ పొలిమేర్ల నుంచి చాందర్ గంధం శిరస్సుపై ఉంచుకుని ఖాదరిబాబా దర్గాకు చేరుకున్న ఎమ్మెల్యే బాబావారికి మొక్కులు చెల్లించి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యేకు దర్గా పెద్దలు బాబావారి ప్రసాదాన్ని అందించి మర్యాదపూర్వకంగా సత్కరించారు. ప్రసిద్ధి చెందిన ఔలియా ఖాదరి ఉరుసు ఉత్సవాల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని బాబా వారి ఆశీస్సులు అందరిపై ఉంటాయన్నారు. కార్యక్రమంలో పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ బాజీ, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మెరుగుమాల కాళీ, సంచార జాతుల కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ సయ్యద్, ఖాదరిబాబా దర్గా పెద్దలు యాకూబ్‌బేగ్, అబ్జల్‌బేగ్, అమీనాబేగ్, మొయిన్‌బేగ్, అబ్దుల్ తాజుద్దీన్ పాల్గొన్నారు.



ఉరుసు ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కొడాలి నాని, మైనార్టీ నాయకులు

మట్టి అక్రమంగా తరలిస్తున్న లారీల పట్టివేత



పామర్రు: అక్రమంగా మట్టి రవాణా చేస్తున్న రెండు వాహనాలు సీజ్ చేసిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. మండల పరిధిలోని పెదమద్దాలి శివారు కొత్తూరు గ్రామంలో అక్రమంగా మట్టి రవాణా జరుగుతోందని వీఆర్వోకి సమాచారం వచ్చింది. కానీ ఆయన నుంచి ఎటువంటి స్పందనలేదు. మరొక వీఆర్వో మీనాకు మట్టి అక్రమ రవాణా గురించి సమాచారం వచ్చింది. దీంతో ఆమె హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మట్టి లోడ్‌తో వస్తున్న రెండు టిప్పర్లను నిలుపుదల చేశారు. ఎటువంటి అనుమతులు లేని కారణంగా రెండు వాహనాలు సీజ్ చేశారు.

ఈదురు గాలులకు నేలకొరిగిన చెట్లు



అడ్డాడ(పామర్రు): మంగళవారం రాత్రి వీచిన గాలులకు రహదారులపై చెట్ల కొమ్మలు విరిగి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాలపై పడిపోయాయి. గ్రామం నుంచి జమీగొల్వేపల్లి వెళ్లే ప్రధాన రహదారిలోని చెట్ల కొమ్మలు పడటంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం తెలుసుకున్న విద్యుత్‌శాఖ ఏఈ మోహనకృష్ణారావు వెంటనే స్పందించి ఘటనా స్థలానికి తమ సిబ్బందితో చేరుకుని చెట్ల కొమ్మలను తొలగించి విద్యుత్ పునరుద్ధరించారు.

స్వాతంత్య్ర సమర యోధుల జీవితాలు ఆదర్శం



స్వాతంత్య్ర సమర యోధుల జీవిత చరిత్ర పుస్తకాలు చూపుతున్న విద్యార్థులు

జమీగొల్వేపల్లి(పామర్రు): స్వాతంత్య్ర సమర యోధుల జీవితాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని ప్రముఖ యోగా గురువు వివి ధర్మారావు అన్నారు. మండల పరిధి జమీగొల్వేపల్లిలోని గ్రంథాలయంలో వేసవి శిక్షణలో భాగంగా బుధవారం స్వాతంత్య్ర సమర యోధుల జీవిత చరిత్ర గ్రంథాలు, ఫొటో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం కోసం ఆ మహనీయులు చేసిన త్యాగల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛగా జీవించగల్గుతున్నామని చెప్పారు. విద్యార్థులు దేశ భక్తిని కల్గి ఉండాలని తెలిపారు. దేశం కోసం వారు చేసిన త్యాగాలను గురించి తెలుసుకోవాలని కోరారు. మహనీయుల అడుగు జాడల్లో నడవాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా మండలి అధ్యక్షురాలు గుమ్మడి ఉషాదేవి, గ్రంథాలయ అధికారి వి నాగ సురేష్, పాఠకులు, విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరాలు

మండవల్లి: స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా పిల్లలతో చిల్డ్రన్స్ మ్యాగజైన్స్‌ను బుధవారం గ్రంథాలయాధికారి షేక్ పర్వీన చదివించారు. మ్యాగజైన్స్‌పై పిల్లలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పర్వీన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్రంథాలయ విజ్ఞాన శిబిరం పిల్లలకు ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు.



పిల్లలతో మ్యాగజైన్స్ చదివిస్తున్న గ్రంథాలయాధికారి షేక్ పర్వీన

ప్రతి ఇంటా మొక్కలు పెంచాలి

ముదినేపల్లి రూరల్: పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఇంటా మొక్కలు పెంచేందుకు విద్యార్థులు కృషి చేయాలని స్థానిక శాఖా గ్రంథాలయ లైబ్రేరియన్ ఎం.శ్రీదేవి అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మొక్కలు పెంపకం ఆవశ్యకత గురించి విద్యార్థులకు బుధవారం వివరించారు. మొక్కలు పెంపకం వల్ల వాతావరణ సమతుల్యత ఏర్పడడంతో పాటు ఆరోగ్యానికి రక్షణ చేకూరుతుందన్నారు. స్థానిక నర్సరీలో ఉచితంగా మొక్కలు పంపిణీ చేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. వర్షాలు ప్రారంభం కాగానే ప్రతీ విద్యార్థి ఇళ్ల వద్ద మొక్కలు నాటాలని సూచించారు. మొక్కలు పెంపకం ఆవశ్యకత గురించి పెద్దలకు వివరించాలన్నారు. విద్యార్థులకు ఇండోర్ గేమ్స్ నిర్వహించి స్నాక్స్ పంపిణీ చేశారు.

క్రికెట్ టోర్నమెంటు విజేత పెదలంక



టోర్నమెంటు విజేత పెదలంక జట్టుకు బహుమతి అందిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీపీలు

కైకలూరు: వేసవి సెలవుల నేపథ్యంలో దొడ్డిపట్ల ప్రీమియర్ లీగ్ (డీపీఎల్) పేరుతో దొడ్డిపట్ల జెడ్పీహెచ్ స్కూల్లో మే 25న ప్రారంభమైన టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంటు విజేతగా కలిదిండి మండలం పెదలంక జట్టు నిలిచింది. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ ముగింపు కార్యక్రమానికి విచ్చేసి బుధవారం బహుమతులు అందించారు. సర్పంచ్ చెరుకువాడ బలరామరాజు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు మాట్లాడుతూ నేటి సమాజంలో చదువుతో పాటు క్రీడలు ముఖ్యమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రీడలకు అత్యధిక ప్రాధాన్యత కల్పిస్తున్నారని చెప్పారు. మొదటి బహుమతి పెదలంక హరీస్ లెవెన్స్ (రూ.50,000, దాత సర్పంచ్ బలరామరాజు), రెండో బహుమతి కిరణ్ లెవెన్స్ - గుర్వాయిపాలెం (రూ.35,000, పీవీ సుధాకరరావు), మూడో బహుమతి వరహాపట్నం - అగ్రహారం (రూ.25,000, ఎ.సత్యనారాయణ), నాలుగో బహుమతి అతిథ్య దొడ్డిపట్ల జట్టు (రూ.15,000, వి.బసవశంకర్) అందుకున్నాయి. మ్యాన్ ఆఫ్ ది సిరీస్ (అనిల్ చైతన్య -దొడ్డిపట్ల), బెస్ట్ బ్యాట్స్‌మెన్ (వంశీ కిరణ్, దొడ్డిపట్ల), బెస్ట్ బౌలర్ (చందు, భీమవరం), బెస్ట్ కీపర్ (విక్టర్, గుర్వాయిపాలెం), మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ (విద్యాసాగర్, పెదలంక) అందుకున్నారు. వీరికి నగదు దాతలుగా అశోక్‌వర్మ, తాతరాజు, కృష్ణ, రమేష్, వెంకటస్వామి వ్యవహరించారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, సయ్యపురాజు గుర్రాజు, ఎంపీటీసీ సభ్యురాలు కర్ణం లక్ష్మీదుర్గా, ఉపసర్పంచ్ సురేష్, కర్ణం శ్రీను, నిర్వాహకులు ఫణీంద్ర, రాజు, వీరాంజనేయులు, జీవన్‌బాబు, మణి, జితేంద్ర, నాగబాబు, ఎస్.సురేష్ పాల్గొన్నారు.



కప్పు అందుకుంటున్న జేజే నగర్ టీమ్

క్రికెట్ పోటీల్లో జేజే నగర్ యూత్ టీమ్ విజేత...

మొవ్వ: మండల కేంద్రం మొవ్వ గ్రామంలోని శ్రీ మండవ కనకయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బుధవారం జరిగిన మొవ్వ టీ10 క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ ఉత్కంఠంగా సాగింది. 30 టీమ్‌లు పాల్గొన్న ఈ టోర్నీ ఫైనల్ మ్యాచ్ జేజేనగర్ యూత్ టీమ్, ఉయ్యూరు అయ్యప్ప సీసీల మధ్య జరిగింది. తొలిత బ్యాటింగ్ చేసిన జేజే నగర్ యూత్ టీమ్ నిర్ణీత 10 ఓవర్లో 7 వికెట్‌ల నష్టానికి 84 పరుగులు చేయగా ఉయ్యూరు అయ్యప్ప సీసీ 7 వికెట్‌లు కోల్పోయి 77 పరుగులు మాత్రమే చేసింది. విజేతగా జేజే నగర్ యూత్ టీం నిలిచింది. క్రికెట్‌లో చక్కని ప్రతిభ కనపరిచిన కొడాలి బాబూరావు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా, గుర్విందపల్లి రవితేజ మ్యాన్ ఆఫ్ ద సిరీస్‌గా నిలిచారు. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో మండవ కోటేశ్వరరావు, పిచ్చేశ్వరరావు, కొమ్ముకూరి వెంకటేశ్వరరావు, శీలం రాంబాబు, శీలం రామారావులు పాల్గొని కెప్టెన్ శీలం వంశీకి ట్రోఫీ అందచేశారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

ముదినేపల్లి రూరల్: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య లబ్ధిదారులను కోరారు. మండలంలోని పెదపాలపర్రు, పెయ్యేరు, గురజ గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో లబ్ధిదారులతో బుధవారం సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతగానో కృషి చేస్తున్నారని చెప్పారు. ఇళ్ల నిర్మాణాలు సత్వరమే పూర్తి చేసేందుకు ఎలాంటి జాప్యం లేకుండా బిల్లులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న రూ.1.80 లక్షల ఆర్థిక సాయంతో పాటు డ్వాక్రా మహిళలకు అదనంగా రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు చెప్పారు. దీనిని సద్వినియోగం చేసుకుని నిర్మాణాలు పూర్తిచేసేందుకు ముందుకు రావాలన్నారు. మండలంలోని జగనన్న కాలనీల్లో ఇప్పటికే రోడ్లు, విద్యుత్ వంటి సౌకర్యాలు కల్పించామన్నారు. త్వరలోనే ఇతర సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి ఆశయం మేరకు నిర్మాణాలు వెంటనే పూర్తిచేయాలని సూచించారు.

రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కైకలూరు: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అడవి కృష్ణ అధ్యక్షతన శుక్రవారం నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ కె.రామలింగేశ్వరరావు బుధవారం తెలిపారు. వివిధ శాఖల అధికారులు పూర్తి ప్రగతి నివేదికలతో హాజరు కావాలని సూచించారు. సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు తప్పక హాజరు కావాలని కోరారు.

అనారోగ్యంతో ఉపాధి కూలీ మృతి

పమిడిముక్కల: అనారోగ్యంతో ఉపాధి కూలీ మృతి చెందిన ఘటన మండలంలోని ఐనంపూడి గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన యరబర్ల బ్రహ్మయ్య (62) ఉదయం ఉపాధి పనికి వెళ్లారు. నీరసంగా ఉందని పని ఆపి పక్కన కూర్చొన్నాడు. ఆసుపత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యలో మృతి చెందాడని ఏపీఓ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

పకడ్బందీగా ఫ్యామిలీ డాక్టర్

జమీదగ్గుమిల్లి(పామర్రు): ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ (ఎఫ్‌పీసీ)ని అత్యంత పకడ్బందీగా అమలు చేస్తూ ప్రజలకు ఉన్నతమైన వైద్యసేవలను అందించటమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందని కనుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు వేదాంతం వంశీ కృష్ణ అన్నారు. పీహెచ్‌సీ పరిధిలోని జమీదగ్గుమిల్లి గ్రామంలో బుధవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవన శైలి జబ్బుల బాధితులను గుర్తించి వారి ఆరోగ్యంపై ప్రత్యేకంగా దృష్టి పెడతామని తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ ఫలానా గ్రామానికి ఫలానా రోజు వస్తారనే వివరాలను ముందుగానే వెల్లడిస్తున్నామని పేర్కొన్నారు. ఆయా తేదీల్లో గ్రామానికి డాక్టర్లు వస్తున్నట్లు ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు ప్రజలందరికీ తెలియజేస్తామన్నారు. డాక్టర్ వద్దకు వచ్చి ప్రజలు వైద్య సేవలు పొందుతున్నారని తెలిపారు. ఎఫ్‌పీసీని మెరుగ్గా ముందుకు తీసుకెళ్లేలా సమర్థులైన సేవలను వినియోగించుకోవాలని కోరారు. గర్భిణులు, చిన్నారులకు మంచి పౌష్టికాహారం అందించడం ద్వారా రక్త హీనత సమస్యను ఎదుర్కొనే విధంగా తగు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. గ్రామ సర్పంచ్ కె చంద్రశేఖర్‌రావు, సీహెచ్‌వో బి.ఉదయ్ కిరణ్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఏఎన్ఎం ఆదాంబీ, 104 వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



జమీదగ్గుమిల్లిలో వైద్య సేవలను అందిస్తున్న పీహెచ్‌సీ వైద్యులు వీ వంశీకృష్ణ

ఉపాధి పనులతో గ్రామాల్లో అభివృద్ధి

మండవల్లి: ఉపాధి హామీ పనుల ద్వారా గ్రామాలు అభివృద్ధి పథంలో కొనసాగుతున్నాయని ఇన్‌ఛార్జి ఏపీఓ ఎన్.నవీన్ తెలిపారు. మండలంలోని కానుకొల్లు గ్రామంలో రూ. 6 లక్షల 76వేల 300 అంచనా విలువతో ఫీల్డ్ చానల్ పనులను బుధవారం 57 మంది ఉపాధి కూలీలు నిర్వహించినట్లు తెలిపారు. నవీన్ మాట్లాడుతూ ఉపాధి పనుల ద్వారా గ్రామాలు అభివృద్ధి సాధిస్తున్నాయన్నారు. తాగునీరు, సాగునీటి సమస్యలు తీరుతున్నాయని పేర్కొన్నారు. రైతులు అధిక దిగుబడులు సాధిస్తున్నారని తెలిపారు. పశువులకు చెరువులలోని నీరు దాహార్తి తీర్చడానికి ఎంతగానో ఉపయుక్తంగా ఉంటుందన్నారు.



కానుకొల్లులో ఫీల్డ్ చానల్ పనులు నిర్వహిస్తున్న ఉపాధి కూలీలు

వంతెన పనులు ప్రారంభం

కైకలూరు: శిథిలావస్థ వంతెనతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఊరట లభించనుంది. మండల పరిషత్ నిధులు రూ.7 లక్షలతో నూతన వంతెన పనులను ఎంపీపీ అడవి కృష్ణ, ఎమ్మెల్యే డీఎన్నార్ కుమారుడు దూలం శ్యామ్ బుధవారం ప్రారంభించారు. పూర్వం ముప్పా నాగేశ్వరరావు చికెన్ దుకాణం నుంచి పోల్‌రాజ్ పంట కాల్వపై నిర్మించిన కాలిబాట వంతెన శిథిలావస్థకు చేరింది. దీంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీనిని తొలగించి కొత్త వంతెన ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఇక్కడ వంతెన నిర్మాణం వల్ల అనేక కుటుంబాలకు ఉపయోగకరమన్నారు. నాలుగు చక్రాల వాహనాలు ప్రయాణించే అవకాశం ఉందన్నారు. పూర్తి నాణ్యతా ప్రమాణాలతో నిర్మాణం చేపట్టాలని కాంట్రాక్టరుకు సూచించారు. కార్యక్రమంలో తులసి పూర్ణ, తిరుమలశెట్టి నరసింహామూర్తి, పంచాయతీ సిబ్బంది రవి పాల్గొన్నారు.



వంతెన నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎంపీపీ అడవి కృష్ణ తదితరులు

రసాయనాలతో భూసారానికి దెబ్బ

కాజ(మొవ్వ): రైతులు అవలంబిస్తున్న రసాయన వ్యవసాయం వల్ల పెట్టుబడులు అధికమవ్వటమే కాకుండా భూసారం దెబ్బతింటుందని మాస్టర్ ట్రైనర్ రామోహన్ రెడ్డి సూచించారు. బుధవారం మొవ్వ మండలం కాజ గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయం సిబ్బంది ఆధ్వర్యంలో తొలకరి ముందు నవధాన్యాల సాగు పద్ధతి పై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రైతులు పర్యావరణానికి, మానవ ఆరోగ్యానికి మేలు చేసే ప్రకృతి వ్యవసాయ విధానాన్ని అనుసరించాలని సూచించారు. 32 రకాల విత్తనాలతో ప్రీ మాన్సున్ డ్రై సోయింగ్ విధానంలో విత్తుకోవటం వల్ల పంట మార్పిడి జరుగుతుందని తెలిపారు. తద్వారా ప్రధాన పంటకు కావాల్సిన అన్ని రకాల పోషకాలు భూమికి అంది దిగుబడి పెరుగుతుందన్నారు. అలాగే నవధాన్యాలు సాగు చేసి నేలలో కలియదున్నటం మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ఆర్‌బీకే కేంద్రాల్లో నవదాన్యాల కిట్టులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజన్ యాంకర్ గొంగి పోతలయ్య, వీఏ హేస్సేన్, యూనిట్ ఇన్‌చార్జ్ విజయ భాస్కర్ రెడ్డి, కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్‌లు, రైతులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ట్రైనర్ రామ్మోహన్‌రెడ్డి